# గాలి దారం దేవతా వస్త్రాలు

*20వ శతాబ్దానికి 78 ఏళ్ళు వచ్చేశాయి. అయినా ఆంధ్రదేశం మాత్రం ఇప్పటికీ గత శతాబ్దపు అలవాట్లనుంచి ఆచారాల్నించి ఆలోచనల నుంచి తప్పించుకుని బయట పడలేదు.*

*ఇతర దేశాలు వైజ్ఞానికంగా ఎంతో అభివృద్ధి చెంది గ్రహాంతర్యానాలు చేస్తుంటే, మనం గ్రహచారాన్ని నిందించు కుంటూ కర్మసిద్ధాంతాన్ని ఆరాధిస్తున్నాం. అంతా వాడి దయ. మనచేతిలో ఏమీలేదు. అంతా విధివిలాసం, లలాట లిఖితం అనే నిరాశా వాదానికి అంకితమై పోయాం.*

ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే, తెలుగుదేశాన్ని 20వ శతాబ్దంలోకి ఈడ్చుకు రావడానికి గడిచిన పది సంవత్సరాలనుంచి తీవ్రప్రయత్నం చేస్తున్నవాడ్ని కాబట్టి.

అప్పట్లో నా వయస్సు పాతిక సంవత్సరాలు. ఏదో చెయ్యాలనే ఉబలాటం! ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో తోచక పోవడం.

ఏది చెయ్యడానికైనా డబ్బు ముఖ్యమన్న సంగతి అప్పటికి నాకు తెలీదు. క్రియాసిద్ధి స్సత్వే భవతి అని గట్టిగా నమ్మేవాడ్ని. ఆ రోజుల్లోనే మా నాన్న మరణించాడు. నేను నిస్సహాయుడిగా ఒంటరిగా మిగిలిపోయాను. మా నాన్న బ్రతికున్నప్పుడు మమ్మల్ని పీడిస్తున్నట్లు నేను తెలుసుకోలేకపోయిన దరిద్రం ఇప్పుడు విశ్వరూపం ధరించింది. నా కాలేజీ చదువు డిగ్రీ సముపార్జనతో ముగిసే దాకా మా నాన్న చాలా సతమత మవుతుండేవాడని నాకు తెలుసు.

ఒకనెల మరీ కష్టమై పోయినప్పుడు నేను చదువుకు స్వస్తి చెప్పి ఏదైనా ఉద్యోగంలో ్రేశిస్తానని మా నాన్నతో అనడం నాకు బాగా జ్ఞాపకం. తన బొందిలో జీవుడుండగా నా ్ర ఆగిపోనివ్వనన్నాడు మా నాన్న. అలాగే సాధించుకుని వచ్చాడు.

ఆయన మరణంతో నా జీవితంలో ఒక అధ్యాయం ముగిసింది. మతాలన్నా ్ని కాలేజి రోజుల్లోనే నాలో అసహ్యభావం ఏర్పడింది. గోరాగారివి, యం.యన్. త్రిపురనేని రామస్వామిచౌదరి గారివి రచనలు ఆవురావురుమని చదువుతూ డిని. నేను తీసుకున్న సైన్సు డిగ్రీకూడా నాలో పరిశీలనాశక్తిని పెంపొందించింది. చే శక్తికి దోహదమిచ్చింది. కాని నాకు తిండి పెట్టే శక్తి మాత్రం కష్టపడి సంపాదించిన డిగ్రీకి లేకపోయింది. విద్యాధిక నిరుద్యోగి పటాలంలో నేనూ ఒక పాదచారినైనాను. ి ఒక ఉద్యోగం చెయ్యక తప్పని పరిస్థితి కాబట్టి ఒక అచ్చాఫీసులో ప్రూఫ్‌రీడర్ ఉద్యోగానికి కుదురుకున్నాను. నివసించడానికి చోటేదీ లేనందున ఆ అచ్చాఫీసులోనే ఓ మూల పడివుండే వాడ్ని.

వొకపూట తిండి వుంటే, రెండో పూట తిండి లేకుండా వుంటూ కాలం గడిపేవాడ్ని. ఆ ప్రెస్ ఆఫీసులో ఎక్కువగా ఆధ్యాత్మిక గ్రంథాలు అచ్చవుతూ వుండేవి. వాటిలో అచ్చు తప్పులు దిద్దేసరికి నా తలప్రాణం తోకకు వచ్చేది. ఎందరెందరు దేవుళ్ళు, వొకొక్కరికి ఎన్నెన్నేసి పేర్లు. ఎంత కష్టపడి దిద్దినా ఏవో అచ్చుతప్పులు మిగిలిపోయేవి. విచిత్రం ఏమిటంటే ఆ తప్పుల తడకలతోనే వ్రతాలు చేయించే వాళ్ళు, నిత్యపారాయణం చేసేవాళ్ళు, దేవతార్చనలు చేయించేవాళ్ళు, దేశమంతటా కోకొల్లలుగా నిండి ఎవరికి వారు వచ్చే జన్మలో తమ స్వంత సౌఖ్యానికి రాచబాటలు పడిపోయినట్లు సంతృప్తిగా సంతోషించడం.

ఆ రోజుల్లో నేను 20వ శతాబ్దం గురించి, యంత్ర నాగరికత గురించి తీవ్రంగా ఆలోచిస్తూ ఉండేవాడ్ని. నిజంగా నేను 20వ శతాబ్దంలో వున్నానా లేక ఇంకా పాత రాతి యుగంలోనే వుండిపోయానా అనిపించేది. మానవ విజ్ఞానం ఉరకలు వేస్తూ పరుగులు తీస్తూ ఉంటే నేను గాలి దారాలతో దేవతా వస్త్రాలు అల్లుతున్నానేమో ననిపించేది. ఏమో వొకవేళ అదికూడా సాధ్యం కాకూడదా అనిపించేది.

ఇది 1978. నేను చెపుతున్నది. పది సం. క్రితం మాట. అప్పటి స్వప్నం ఇప్పుడు వాస్తవం కాబోతున్నదేమోనని నా అనుమానం. ఈ పదేళ్ళలో ఎంతమార్పు వచ్చింది. వొక్క మన దేశంలోనే కాదు. మొత్తం ప్రపంచంలోనే. ప్రపంచం సంగతి అలా వుండనిద్దాం. మన దేశం విషయం ఆలోచిస్తే విదేశీయ బహుళ జాతీయ సహకార, సహాయాలతో మన దేశపు బడా బడా పెట్టుబడిదారుల నిజంగానే గాలిదారాలతో దేవతా వస్త్రాలు టన్నుల కొద్దీ ఉత్పత్తి చేసేటట్టుగా వుంది. అయితే ఇందువల్ల మన దేశంలో వొంటినిండా కప్పుకోడానికి చింకి పాతకూడా కరువయిన కోటానుకోట్ల అభాగ్య జనులకు వస్త్ర సమస్య తీరుతుందా? గాలి మనదేశానిది అయితే వస్త్రాలు విదేశాలకు పోతాయేమో? ఈ దేశంలో తయారైన వస్తువులు ఈ దేశ ప్రజలకే ఎప్పుడు దక్కుతాయో? ఫరవాలేదు. 20వ శతాబ్దం ఇంకా పూర్తికాలేదు. కావడానికి ఇంకా ఇరవయి రెండేళ్లు కావాలి.ఎప్పుడూ నేను ఆశావాదినే. 25వ ఏట పరమ దరిద్రపు స్థితిలో వున్నప్పుడూ ఆశావాదినే. ఇప్పుడు ముప్ఫయ్యయిదో ఏటా ఆశావాదినే. ఇది నాలో సరికొత్త పాతకథ. ఎంచేతనంటే, ఇదివరకే చెప్పవలసింది ఇప్పుడు చెప్తున్నాను.

ఇది ప్రేమ కథ! ఇది చాలా మంది కథని నా వుద్దేశం. కాని దీని మంచి చె నిర్ణయించే అధికారం నాకు లేదు. నేనెప్పుడూ మంచినే ఆరాధిస్తాను కాబట్టి నే చేసినా అది మంచిదే ననుకుంటాను. ప్రేమించడం మంచిపని కాదని ఎవరూ కదా! ఆ పనినే చేశాను. అది మంచిదని నేననుకుంటాను.

అయితే నేను ప్రేమించిన వ్యక్తి ఇంకొకరి భార్య కాబట్టి బహుశా ఈ నేను చాలా చెడ్డపని చేశాననుకోవచ్చు. "వాడా! ఆ కనకాంబరంగాడా ఫలానా లేచిపోయాడు." ఆ తర్వాత తిట్లు శాపనార్థాలు నా ప్రేమ కథకి సంబంధించిన వివరాలు సమాజానికి తెలియవు కాబట్టి తెలుసుకోవలసిన అవసరం లేదు. కా సమాజం దృష్టికి నేను చేసిన పని చెడ్డపనిగానే కనిపిస్తుంది. పైగా నన్ను ప్రేమించిన వయస్సులో నా కన్నా 4 ఏళ్ళు పెద్ద. కనీసం ఈ విషయంలోనన్నా నేను షేక్స్పియ కన్నా గొప్పవాడినని నాలో నేనే మురిసిపోతూ వుంటాను.

ఆవిడ మా ఆవిడని గొప్పలు చెప్పడం కాదుగానీ, వాస్తవంగానే ఆమె చాలా గొప్ప వ్యక్తి. ఆమె గొప్పతనం వల్లనే నా బీదతనం పటాపంచలైపోయింది. ఈ కారణంగా కూడా సమాజం నన్ను ఆమె డబ్బుకాశపడిన దుర్మార్గుడిగా పరిగణించవచ్చు. నా పేరు కనకాంబరమని నేను చెప్పకుండానే బయటపడింది. మా యింటి పేరు సరే తర్వాత చెప్తాను. ముందుగా ఆవిడ పూర్తిపేరు చెప్పాలి. చెపితే అందరకూ ఆశ్చర్యం కలగవచ్చునేమో కాని అనౌచిత్యం మాత్రం అందులో ఏమీలేదు. ఆవిడ పేరు దేవతావస్త్రాలు, ఇంటిపేరు గాలిదారాలవారు; వెరసి ఆవిడ పూర్తిపేరు గాలిదారాల దేవతావస్త్రాలు.

ఇటువంటి పేరున్న మనుషులు కూడా వుంటారా అంటే నేనే మొదట నమ్మలేదు. తర్వాత మనిషిని చూశాక నమ్మక తప్పడం లేదు. ఆవిడ్ని నేనెప్పుడూ పూర్తిపేరు పెట్టి పిలిచిందిలేదు. దేవతా! అనే పిలుస్తాను. పేరుమీద నమ్మకం లేని నాకు మనుష్యుల్లోనే దేవత లుంటారని ధృఢ విశ్వాసం.

ఆచ్చాఫీసులో ప్రూఫ్‌రీడర్‌గా ఉద్యోగం చేస్తున్న తొలివారంలోనే నాకా పనంటే మొగంమొత్తి పోయింది. ఇంకే వుద్యోగం చెయ్యకూడదనీ, స్వతంత్రంగా జీవించాలనే అనుకున్నాను. కాని చేతిలో చిల్లిగవ్వ అయినా లేని నాకు ఇది ఎలా సాధ్యం? చూద్దాం. మనసుంటే మార్గమే దొరక్కపోతుందా? నా కన్నా ముందుగానే 20వ శతాబ్దంలో ప్రవేశించిన వ్యక్తిగా దేవతను నేను ఎరుగుదును. కాని అప్పటికింకా నా కావిడతో ముఖ పరిచయమైనా లేదు.

ఆవిడ గురించి నేను ఎన్నో విశేషాలు వింటూ ఉండేవాడ్ని. పత్రికల్లో ఆవిడ ఫోటో తరచు చూస్తుండేవాడ్ని. ఏ ఫోటోలోను ఆవిడ 30సం॥ల వయస్సు కలిగినదిగా కన్పించేదికాదు. ఆవిడ గురించి ఎవ్వరూ మంచిగా చెప్పకునేవారు కాదు. అందరి దృష్టిలో ఆమె ఒక రాక్షసి. ఆవిడ బహిరంగంగా నవలలు, రహస్యంగా కవితలు రాస్తూ వుంటుంది. ఈ రెండో విషయం నాకామెతో పరిచయమైన చాలా కాలానికిగాని తెలియదు.

అయినా మొదటిసారిగా నేనామెను ఒక సాహితీ సభలో తన ఉపన్యాసం ముగించుకుని బయటకు వస్తుండగా కలుసుకొని "నమస్కారమండీ కవయిత్రిగారూ" అని పలకరించాను. ఆవిడ ముఖం చిట్లించుకొంటూ నావేపు చురచుర చూస్తూ "నేను వయిత్రిని కాను, రచయిత్రిని" అన్నారు. "అదేమిటి అలా అంటున్నారు." "అది అంతే. దరికీ అర్థమయ్యేది వచనం. ఎవ్వరికీ బోధపడనిది కవిత్వం." "అది కాదండి, ఇవాళ పన్యాసం అసాంతం కవితా మయంగా ఉంది." "అంటే నీకది బొత్తిగా బోధపడలేదన్న అంటూ ఆవిడ విసురుగా తన కారువేపుకు వెళ్ళిపోయింది.

నేను ఆవిడ వెళ్ళినవైపే చూస్తున్నాను ఒకసారి ఇటు తిరిగి చూస్తుందేమోనన్న ాశతో. తన కారు తానే నడుపుకుంటూ వెళ్ళి పోయిందావిడ. నన్నో పసివాడ్నిగా ుంచి ఆమె మాట్లాడిన తీరును బట్టి నాకన్నా ఆమె చాలా పెద్దని గ్రహించాను. ఒక్క యస్సులోనే కాదు అనేక విషయాల్లో.

తర్వాత ఆవిడకొక కార్డు వ్రాశాను దేవతగారూ అని సంభోదిస్తూ. కవిత్వానికి వారిచ్చిన నిర్వచనం చాలా బాగుందని, వారి నవల్లంటే నాకెంతో ఇష్టమని, ఒకసారి వారిని దర్శించే భాగ్యం కలుగచెయ్యమని.

మర్నాటి పోస్టులో ఆవిడ జవాబు కార్డుమీదనే వచ్చింది. మగవాళ్ళు పురుగులు. నువ్వు నన్ను చూడనక్కర్లేదు అని కుదురైన ఇంగ్లీషు అక్షరాలలో ముక్తసరిగా అందులో వుంది. క్రింద సంతకం లేదు. ఆటోగ్రాఫ్ పుస్తకంలో జాగ్రత్త పరుస్తాననేమో కానీ ఆ ఇంగ్లీషు వుత్తరం ఇప్పటికీ నా దగ్గర భద్రంగా వుంది.

నేను పురుగును కాను, మనిషంత మనిషిని. ఈ దేవత ఎవరినైనా పురుగులా తీసిపారెయ్యొచ్చును. కాని నేను మాత్రం అందరిలాంటి వాణ్ని కాను. నాలో వ్యక్తిత్వం ఉంది. ఆ వ్యక్తిత్వంలో నేను చెయ్యాల్సిన పనులు చాలా వున్నాయి. ఈమె నన్ను గుర్తించాలి.

లేనిపోని లాంఛనాలకు పోవడమెందుకని నేనే చొరవ తీసుకొని ఒకసారి ఆవిడ ఇంటికి వెళ్ళాను. అప్పుడావిడ ఇంట్లో లేరు. ఆమె భర్తగారు నన్ను సాదరంగా ఆహ్వానించారు. ఎంతో మర్యాద చేశారు. అయినా ఆయన్ని చూసిన తర్వాత, సుమారు అరగంట ఆయనతో గడిపిన తర్వాత మగవాళ్ళందరినీ ఆవిడ పురుగులని ఎందుకనుకుంటుందో నా కర్థమయింది. ఈ లోకంలో మోసానికి తప్ప న్యాయానికి తావులేదు. అయినా ఏదో మాయోపాయంతో ఈవిడని కలుసుకోవడమనేది నా స్వభావానికి విరుద్ధం. ఎలాగయినా ఆవిడ దృష్టిలోకి నేను రావాలి.

ఒక రాత్రంతా కూర్చుని ఒక పెద్ద వుత్తరం వ్రాశాను. గాలిదారాల దేవతా వస్త్రాలగారూ, మీ పేరెంత అస్వాభావికమైనదో మీ నవలలంత అధ్వాన్నమైనవి. మీ నవలల్లో ఉత్త సెంటిమెంటల్ నాన్‌సెన్స్ తప్ప మరేమీలేదు. ఆ తర్వాత 20, 30 వాక్యాలలో ఆమె రచనల్ని దుయ్యబట్టాను. నేనో వింత మహిళామణినని మీ గురించి మీరనుకుంటారు. ఇది నిరాధారమైన దురభిప్రాయం. స్త్రీ పురుష సంబంధాలను మీరు చిత్రించే తీరు పురుష జాతికే కాక స్త్రీజాతికి కూడా అవమానకరం. నిస్సందేహంగా మీలో వున్న రచనా సామర్థ్యాన్ని మీరు దుర్వినియోగం చేస్తున్నారు. ఆ తర్వాత 20వ శతాబ్దపు నాగరికత మీద నాకున్న అభిప్రాయాలను విపులంగా వివరించాను.

ఇక కాస్త వ్యక్తిగతంగా మిమ్మల్ని విమర్శిస్తున్నందుకు నన్ను క్షమించండి. మీరు మగవాళ్ళలా కనబడాలన్న తాపత్రయంతో జీన్సు ధరించినా, దొరచుట్టలు సేవించినా ప్రకృతి సిద్ధంగా మీలో వున్న స్త్రీత్వాన్ని ఎన్నటికీ రద్దు చేసుకోలేరు. ఒక విధంగా ఇ ఇతరుల్ని బుద్ధిపూర్వకంగా మోసం చెయ్యటమే ననిపిస్తుంది.

ఆఖర్ని ఆవిడంటే అందరూ ఎందుకసహ్యించుకుంటారో రాశాను. మీరు ఈ ఇద్దరు భర్తలను మార్చినట్లు, మీ స్వీయ చరిత్రలో సగర్వంగా రాసుకున్నారు. మెచ్చుకునే అమెరికా నాగరికతలో మీ రికార్డ్‌ను అతిక్రమించిన మహిళారత్నాలు వున్నారు. వారైనా తమ పాత భర్తలకు విడాకులిచ్చిన తర్వాతనే కొత్త భర్తను చేసుకుంటూ వుంటారు. ఈ మాత్రం నీతికూడా మీకు లేకపోయింది. ఇద్దరు భర్త బ్రతికుండగా, మూడో ఆయన్ని శాస్త్రోక్తంగా పరిణయం చేసుకున్నారు.

తర్వాత నేను స్థాపించ దలచుకున్న తోకచుక్క గ్రంథమాలను గురించి వ్రాశాను ఇది దేవతగారిని అపరిమితంగా ఆకర్షించి వుండాలి. నా గ్రంథాలయానికి ఆవిడే ధన సహాయం చేశారు. అలా ప్రారంభమయింది మా ప్రేమకథ.

పొగడ్తలకు కొంతమంది ఏమాత్రమూ పొంగిపోరు. సాధారణంగా తప్పులు చూపిస్తుంటే కొంత మందిలో కాకపోయినా కొంతమందిలోనైనా పరివర్తన వస్తుంది. అటువంటి పరివర్తనే ఆమెలో వచ్చింది. తన కారులో ఆవిడ నన్ను ఎన్నోసార్లు వాహ్యాళికి తీసుకెళ్ళింది. గంటల తరబడి మేం ఎన్నో విషయాలమీద చర్చించుకొనే వాళ్ళం. మా మనస్సులు విడదియ్యరానంతగా పెనవేసుకుపోయాయి. శారీరక సంబంధమా - వివాహానంతరమే ప్రారంభమయింది. ఈ వివాహానికి ముందు తన భర్తనుండి ఆమె విడాకులు తీసుకోవాలని నేను పట్టుబట్టాను. అందుకు ససేమిరా ఆవిడ ఒప్పుకోలేదు. అయితే మన పెళ్ళి అసంభవమని నిష్కర్షగా చెప్పేశాను. ఓ షరతుమీదైతే ఒప్పుకుంటాను. నీ కిష్టమేనా?

ఏవిటా షరతు? మన పెళ్ళి అయిన తర్వాత నా యింటిపేరు నువ్వు ధరించాలి. అందుకు నేను అంగీకరించాను. ఆ విధంగా నేను గాలిదారాల కనకాంబరమయ్యాను. 10 సం॥లు ఆనందమయంగా సాగిన మా ప్రేమకథ విషాదాంతంగా ముగిసిందని చెప్పడానికి చింతిస్తున్నాను. ఈ 10 సం॥రాల్లో ఇద్దరం కలిసి ఎన్నో లక్ష లార్జించాం. ఎన్నో లక్షలు ఖర్చు చేశాం.

మా ప్రేమకు ఫలితంగా ఇద్దరు బిడ్డలు. ఒక కూతురు, ఒక కొడుకూ పుట్టారు. వాళ్ళు సలక్షణంగా చదువుకున్నారు. అన్నీ వదిలిపెట్టి ఆవిడ వెళ్ళిపోయింది. చనిపోయిందనుకుంటారేమో...లేదు. అగ్నిసాక్షిగా వివాహమాడిన భర్తతో కాపరం చెయ్యడానికి. ఈ సంగతి చెప్తూ తన్ని శాశ్వతంగా మరచిపొమ్మని రాసింది. ఆ ఉత్తరం పైకి కనబడేటట్లుగా ఒక పుస్తకంలో పెట్టింది. ఆ పుస్తకం నిండా ఉన్నదంతా అప్పుడప్పుడు ఆమె రాసిన కవిత్వం. ఎవ్వరికీ బోధపడదన్న ఆమె కవిత్వం నాకు బాగా అర్థం అయ్యింది. మా గ్రంథమాలలో అంతిమ కుసుమంగా ఆవిడ కవితా సంపుటిని అచ్చువేయించాను. దాని పేరు గాలిదారాల దేవతా వస్త్రాలు.

*ముద్రణ : జయశ్రీ మాసపత్రిక*

*1977*